సంపుటి: 2| సంచిక: 6 సెప్టెంబర్ - అక్టోబర్, 2014

# దేవుని స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక




## క్షమించుట... ఎలా?...ఎందుకు?



# “మనస్సులోని మాట”

క్రీస్తుయేసునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.

స్పర్శ పాఠకులకు ప్రభువైన యేసు నామములో వందనములు. గత కాలమంతా ప్రభువైన దేవుని కృప వలన క్షేమకరమైన జీవితమును అనుగ్రహించి సజీవులుగా ఉంచిన దేవునికి కృతజ్ఞతలు చెల్లించవలయును.

మానవ జీవితమును గూర్చి ప్రతి మనుష్యుడు సరియైన అవగాహన కలిగి జీవించవలసి ఉన్నది. విచిత్రమైన విషయం ఏమనగా అనేకులు అట్టి అవగాహన లేని వారిగానే వారి జీవిత కాలమంతయు ఉందురు. అవగాహన అనగా ప్రతి మనుష్యుడు శరీరముతోనే జీవిస్తున్నాడు అని శరీర ధర్మము ప్రకారము బలహీనతలు అనగా శరీర వ్యాధులు లేక త్వరపడి మాట్లాడుట, సామర్థ్యములలో వ్యత్యాసము. అదే విధంగా సామాజిక స్థితిగతులును బట్టి ఆర్థిక, కుటుంబ మానసిక సమస్యలు అనేవి ఉంటాయని. వీటిలో కొన్ని కొందరికి లేకపోవచ్చు, కానీ వీటన్నింటికి అతీతులైన వారు ఎవ్వరూ ఉండరు. గొప్ప గొప్ప భక్తులైన వారి జీవితములలో కూడా వీటన్నింటిని ఎదుర్కొంటూ వారి జీవితములను కొనసాగించడం జరిగింది. దేవుని ఉద్దేశ్యములను ప్రజలకు తెలియపరచవలసిన పెద్దలు సహితము అవగాహన లేకుండా దేవుని నమ్ముకున్న వారికి ఎటువంటి సమస్యలు ఉండవు అని చెప్పుట ద్వారా ఎంతో మంది అమాయకులైన ప్రజలు జీవితములో చిన్న సమస్య వచ్చిన వెంటనే ఎంతో కృంగిపోవుచున్నారు. అపో॥ కార్యములలో దైవజనులు చెప్పినట్లు అనేక శ్రమలు అనుభవించి దేవుని రాజ్యములో ప్రవేశించవలెను. దీనిని విశ్వసించిన వారికి ఉన్న ధన్యత ఏదనగా వారి బాధలలో దేవుని సహాయం దొరుకుతుంది, వాటి నుండి ఆయన వారిని విడిపిస్తాడు. అయితే మనుష్యులు జీవితం అనగా ఏ మాత్రం ఇబ్బంది లేనిదిగా ఊహించుకోవడం సమంజసం కాదు. దాని వలన కొందరు తమ జీవితములో అకస్మాత్తుగా సంభవించే కొన్ని కష్టములలో కుప్పకూలిపోతూ ఉంటారు. వారిలో కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడతారు. ప్రతి మనుష్యుడు జీవితమును గూర్చిన సరియైన అవగాహన కలిగి ఉండుట ఎంతో ముఖ్యమైనది.

అట్టి ధన్యత దేవుడు దయచేయును గాక!

మీ సహోదరుడు.....



సంపుటి: 2 | సంచిక: 6 సెప్టెంబర్ - అక్టోబర్, 2014

# స్పర్శ

ఆధ్యాత్మిక ద్విమాస పత్రిక

## ఈ సంచికలో...


- దేవునికి ఇష్టమైనది ........ 2
- బైబిల్‌లోని ప్రాముఖ్యమైన సంఘటనలు ........ 5
- సహనముతో (స్త్రీల ప్రత్యేకం) ........ 6
- సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర - 36వభాగము ........ 9
- అపాయములో ఉపాయము (బాలల శీర్షిక) ........ 11
- నా జీవితంలో చేసిన మేలులు (సాక్ష్యము) ........ 13
- విశ్వాసంలో ఎదుగుట ........ 15
- ధనము విషయములో పేతురు వైఖరి ........ 18
- ప్రార్థనా శక్తి ........ 20
- బైబిల్ క్విజ్-36 ........ 22
- జన్మదిన శుభాకాంక్షలు ........ 23



మా చిరునామా :

ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 70, ఫోన్: 040-2420 2227



# దేవునికి ఇష్టమైనది

– బ్రదర్.ఎపఫ్రా

క్షమాపణ అనే గుణము ఎంత విలువైనదో గ్రహించినవారు ధన్యులు అని చెప్పుకోవచ్చు. క్షమా గుణము విడుదలకు తాళపు చెవి వంటిది. యేసుక్రీస్తు తన శిష్యులకు నేర్పించిన ప్రార్థనను గమనించెదము. **మీరీలాగు ప్రార్థన చేయుడి, – పరలోక మందున్న మా తండ్రీ, నీ నామము పరిశుద్ధ పరచబడుగాక; నీ రాజ్యము వచ్చుగాక; నీ చిత్తము పరలోక మందు నెరవేరుచున్నట్లు భూమియందును నెరవేరును గాక, మా అనుదినాహారము నేడు మాకు దయచేయుము. మా ఋణస్థులను మేము క్షమించియున్న ప్రకారము మా ఋణములను క్షమించుము. మమ్మును శోధనలోకి తేక దుష్టునినుండి మమ్మును తప్పించుము. – మత్తయి 6:9–13**

క్షమించలేకపోవుట ఒక బంధకము వంటిది. క్షమించుట అనే గుణము ఎంతో ముఖ్యమైనది. నూతన నిబంధనలో అతి ప్రాముఖ్యమైన విషయం అని మనము గ్రహించాలి. ఈ సృష్టిలో ఎన్నో శాసనములు ఉన్నాయి. మనుష్యులు చేసినవి, దేవుని శాసనములు, ప్రకృతి సంబంధమైనవి. నీరు పల్లము ఎరుగు అంటారు. అనగా నీటి స్వభావమును మనం గమనిస్తే అవి ఎత్తు నుండి పల్లమునకు ప్రయాణం చేస్తాయి. ఇది ప్రకృతి సంబంధమైన శాసనము. మనుష్యులు చేసిన శాసనములు మన అనుదిన జీవితంలో పాటించుట లేక పాటించకపోవుట జరుగుచున్నది. మూడవది దేవుని శాసనములు. వీటిని అమలుపరచుటకు లేక తిరస్కరించుటకు మనకు అవకాశం ఇవ్వబడింది. మనుష్యులు చేసిన శాసనములు మీరుట ద్వారా కొంత మేరకు మాత్రమే నష్టపోవుదుము. అదే దేవుని శాసనము లేక నియమము అతిక్రమించుట ద్వారా అధికముగా నష్టపోవుదము. మంచి నిర్ణయము మనలను ఆశీర్వాదములోనికి తీసుకొని వెళితే చెడ్డ నిర్ణయము మనలను శాపములోనికి నడిపిస్తుంది. దేవుని నియమములో మనకు స్పష్టంగా కనిపించుచున్న విషయం, క్షమించు అప్పుడు దేవుని ద్వారా నీవు క్షమించబడెదవు అనగా మనము ఇతరులను క్షమించకుండా మన దోషములకు దేవుని దగ్గర క్షమాపణ పొందలేము.

పేతురు యేసయ్యను ప్రభువా, మేము ఎన్ని సార్లు క్షమించవలెను? అని అడిగాడు. **ఆ సమయమున పేతురు ఆయన యొద్దకు వచ్చి – ప్రభువా, నా సహోదరుడు నా యెడల తప్పిదము చేసినయెడల నేనెన్నిమారులు అతని క్షమింపవలెను? ఏడు మారులమట్టుకా ? అని అడిగెను. అందుకు యేసు అతనితో ఇట్లనెను – ఏడుమారులు మట్టుకే కాదు, డెబ్బది ఏళ్ళ**

**మారులమట్టుకని నీతో చెప్పుచున్నాను. - మత్తయి 18:21,22**

ప్రభువు చెప్పిన మాటల అర్థాన్ని చూస్తే 7సార్లు కాదు, 490 సార్లు అనగా క్షమించుట లెక్కించుకొని చేసేది కాదు, ఎన్నిసార్లు అయిననూ క్షమించవలెనని వారికి నేర్పించడం జరిగింది. అంత మాత్రమే కాక మత్తయి 18:23లో **కావున పరలోకరాజ్యము, తన దాసులయొద్ద లెక్క చూచుకొనగోరిన యొక రాజును పోలియున్నది.అతడు లెక్క చూచుకొన మొదలుపెట్టినప్పుడు, అతనికి పదివేల తలాంతులు అచ్చియున్న యొకడు అతనియొద్దకు తేబడెను. అప్పు తీర్చుటకు వానియొద్ద ఏమియు లేనందున, వాని యజమానుడు వానిని, వాని భార్యను, పిల్లలను వానికి కలిగినది యావత్తును అమ్మి, అప్పు తీర్చవలెనని ఆజ్ఞాపించెను. కాబట్టి ఆ దాసుడు అతని యెదుట సాగిలపడి మ్రొక్కి - నా యెడల ఓర్చుకొనుము, నీకు అంతయు చెల్లింతునని చెప్పగా ఆ దాసుని యజమానుడు కనికరపడి, వానిని విడిచిపెట్టి, వాని అప్పు క్షమించెను. అయితే ఆ దాసుడు బయటకు వెళ్లి తనకు నూరు దేనారములు అచ్చియున్న తన తోడిదాసులలో ఒకనినిచూచి, వాని గొంతుపట్టుకొని - నీవు అచ్చియున్నది చెల్లింపుమనెను. అందుకు వాని తోడిదాసుడు సాగిలపడి - నా యెడల ఓర్చుకొనుము, నీకు చెల్లించెదనని వానిని వేడుకొనెను గాని వాడు ఒప్పుకొనక అచ్చియున్నది చెల్లించువరకు వానిని చెరసాలలో వేయించెను. కాగా వాని తోడి దాసులు జరిగినది చూచి, మిక్కిలి దుఃఖపడి, వచ్చి, జరిగినదంతయు తమ యజమానునికి వివరముగా తెలిపిరి. అప్పుడు వాని యజమానుడు వానిని పిలిపించి - చెడ్డ దాసుడా, నీవు నన్ను వేడుకొంటివి గనుక నీ అప్పంతయు క్షమించితిని; నేను నిన్ను కరుణించిన ప్రకారము నీవును నీ తోడిదాసుని కరుణింపవలసి యుండెను గదా అని వానితో చెప్పెను. అందుచేత వాని యజమానుడు కోపపడి, తనకు అచ్చియున్నదంతయు చెల్లించు వరకు బాధపరచువారికి వాని నప్పగించెను. మీలో ప్రతివాడును తన సహోదరుని హృదయపూర్వకముగా క్షమింపనియెడల నా పరలోకపు తండ్రియు ఆ ప్రకారమే మీయెడల చేయుననెను - మత్తయి 18:23-35** రాజు దగ్గర అప్పు ఉన్న దాసుని ఉపమానం ద్వారా క్షమించలేకపోతే మనము ఎప్పటికి స్వతంత్రులము కాము అనే విషయాన్ని చెప్పడం చూస్తున్నాము.

క్షమాపణా గుణం దేవుని ముఖ్యమైన తాళపుచెవి (forgiveness God's Master Key) అనే పుస్తకపు రచయిత  ఇలా వ్రాసాడు. మానవుని జీవితం ఒక భవంతి వంటిది. దానిలో అనేకమైన గదులు, ఆ గదులలో కొన్ని ఎల్లప్పుడూ తెరిచి ఉండేవి. మరికొన్ని ఎప్పుడూ మూసి ఉండేవి. తెరచిన గదులు అనగా నీ జీవితములో మంచి జ్ఞాపకాలు సంతోషకరమైన విషయాలు. అవి నీకు ఎంతో ఉల్లాసాన్ని ఇస్తాయి. అదే మూసివేయబడిన గదులు అనగా మానసిక గాయాలు, తృణీకరింపబడుట, అవమానించబడుట, భార్యాభర్తలు విడిపోవుట, తప్పులు చేయుట. కొందరి జీవితంలో మూసివేయబడిన గదులు ఎక్కువగా

ఉండటం వలన వారు సంతోషించుట కంటె ఎక్కువ బాధపడుతూనే ఉంటారు. దానికి పరిష్కారం దేవుడు ఇచ్చిన క్షమాపణ అనే తాళపుచెవి మాత్రమే. దానిని ఉపయోగించి మూయబడి ఉన్న ప్రతి గదిని తెరచి శుభ్రపరచుట ద్వారా మనము ఆశీర్వదించబడుదము. **మీరు దేనిగూర్చియైనను ఎవని క్షమించుచున్నారో నేనును వానిని క్షమించుచున్నాను. నేనేమైనను క్షమించియుంటే సాతాను మనలను మోసపరచకుండునట్లు, మీ నిమిత్తము, క్రీస్తు సముఖమునందు క్షమించియున్నాను; సాతాను తంత్రములను మనము ఎరుగని వారముకాము. - 2కొరింథీ 2:10,11** దేవుడు పరిశుద్ధ గ్రంధములో వ్రాయించినట్లుగా మనము క్షమించుట అనే గుణము కలిగి శత్రువైన సాతానుకు అవకాశం లేకుండ ఒకరిని ఒకరు మరియు తమను తాము క్షమించుకొనవలసిన వారమై యున్నాము.

దేవుని ఎరిగి ఉన్నామని చెప్పుకొనే వారిలో అనేకులు తమ జీవితంలో క్షమించుటకు ఎంత ప్రాధాన్యత ఉన్నదో తెలియకుండానే జీవించుట ఎంతో బాధాకరమైన సంగతి. క్షమించుట అనే గుణం లేకపోతే మనము ఏ మాత్రము క్షేమముగా ఉండలేము. జీవిత ప్రయాణములో క్షమించుట అనేది ముఖ్యమైన భాగముగా ఉన్నవారు ఎంతో ఆనందముగా తమ జీవితాలను గడపగలుగుతారు. ప్రభువైన యేసుక్రీస్తును గూర్చి పేతురు తన పత్రికలో ఈ విధంగా వ్రాసియున్నాడు. **- ఆయన దూషింపబడియు బదులు దూషింప లేదు;ఆయన శ్రమపెట్టబడియు బెదిరింపక, న్యాయముగా తీర్పు తీర్చు దేవునికి తన్ను తాను అప్పగించుకొనెను. మనము పాపముల విషయమై చనిపోయి, నీతివిషయమై జీవించునట్లు, ఆయన తానే తన శరీరమందు మన పాపములను మ్రానుమీద మోసికొనెను. 1 పేతురు 2:23,24.**

ఈ సందేశమును చదువుచున్న ప్రతి ఒక్కరూ క్షమించుట అనే గుణమును తప్పక కలిగి ఉందురని ఆశిస్తున్నాను. మన జీవితాలలో ఇట్టి గుణము కలిగి జీవించకుండా దేని కొరకు మనము ఆశించినను అది మనము పొందలేము. అంత మాత్రమే కాకుండా మన దోషములు, అతిక్రమములు మన మీద నిలిచియుండుట ద్వారా దేవుని ఉగ్రతకు గురయ్యేదము. అంతే కాక దేవుని ఉద్దేశములలో నుండి తప్పిపోయి, మన కొరకు దేవుడు సిద్ధపరచిన నిత్య జీవమును కోల్పోయి నిత్య అగ్ని గుండములో త్రోసివేయబడుదము. అయ్యో ఇది ఎంత భయంకరము. ఇలాంటి పరిస్థితి దీనిని చదువుచున్న ఏ ఒక్క వ్యక్తికి కలుగకూడదని నేను కోరుకొనుచున్నాను. ప్రతి ఒక్కరికి క్షమాపణ యొక్క ప్రాధాన్యత పరిశుద్ధాత్ముడు గ్రహింపు కలిగించును గాక !

topwalls.net

# బైబిల్‌లోని ప్రాముఖ్యమైన సంఘటనలు

| | | |
|---|---|---|
| 1. సృష్టి నిర్మాణము | – | ఆదికాండము 1 |
| 2. మానవుని పతనము | – | ఆదికాండము 3:6 |
| 3. జలప్రళయము | – | ఆదికాండము 6–8 |
| 4. బాబెలు గోపురము | – | ఆదికాండము 11:1–9 |
| 5. అబ్రాహాము దేవునిని అంగీకరించుట మరియు అతనికి దేవుని పిలుపు | – | ఆదికాండము 12:1–3 |
| 6. దేవుడు అబ్రాహాముతో నిబంధన చేయుట | – | ఆదికాండము 12:7 |
| 7. బానిసగా యోసేపును ఐగుప్తుకు అమ్ముట | – | ఆదికాండము 37 |
| 8. ఐగుప్తులో ఇశ్రాయేలీయుల బానిసత్వము | – | నిర్గమకాండము 1 |
| 9. మోషేకు పిలుపు | – | నిర్గమ 3:1–10 |
| 10. పది తెగుళ్ళు | – | నిర్గమ 7– 12 |
| 11. ఐగుప్తును విడచుట | – | నిర్గమ 12– 15 |
| 12. విశ్రాంతి దినాచారమును నియమించుట | – | నిర్గమ 16:29 |
| 13. ఇశ్రాయేలీయులకు ధర్మశాస్త్రమును ఇచ్చుట | – | నిర్గమ 20:1–17 |
| 14. మోషే ప్రత్యక్ష గుడారము యొక్క పని పూర్తి చేయుట | – | నిర్గమ 40:33,34 |
| 15. అహరోను మొట్టమొదటి ప్రధానయాజకునిగా అభిషేకించబడుట | – | లేవీ 8:1–12 |
| 16. ఇశ్రాయేలీయులు పాలస్తీనా చేరుటకు యొర్దాను నదిని దాటుట | – | యెహో 3 |
| 17. యెరికో పట్టణముపై విజయము | – | యెహో 6 |
| 18. రూతు బోయజుల వివాహము | – | రూతు 4 |
| 19. సౌలు ఇశ్రాయేలీయుల మొట్టమొదటి రాజుగా అభిషేకించబడుట | – | 1 సమూ 9,10 |
| 20. దావీదు ఇశ్రాయేలీయులకు రాజుగా అభిషేకించబడుట | – | 1 సమూ 16:13 |

(మరికొన్ని వచ్చే సంచికలో)



topwalls.net

# సహనముతో....

– సిస్టర్ వి.విజయ

ప్రతి కుటుంబమునకు స్త్రీ ఆశీర్వాదకరంగా ఉండాలని దేవుని యొక్క ఉద్దేశ్యము. దేవుని చేత ఆశీర్వదించబడాలి అని కోరుకోని స్త్రీలు ఎవ్వరూ ఉండరేమో. అందుకే దేవుడు మొట్టమొదటి కుటుంబమైన ఆదాము హవ్వలని "మీరు ఆశీర్వదించి" అని పలికారు. అయితే స్త్రీ ఆజ్ఞను మీరి పాపము చేయుట వలన ఆశీర్వాదము స్థానములో శాపము ఈ లోకములోనికి వచ్చింది. శాపములో ఉన్న మానవాళిని రక్షించడానికి తండ్రియైన దేవుడు ప్రియకుమారుడైన యేసుక్రీస్తుని ఈ లోకమునకు పంపగా కుమారుడైన యేసయ్య మన శాపమంతటిని భరించి, మనలను విడిపించారు. శాపము నుండి విడింపించబడుట ద్వారా మాత్రమే మనం ఆ మొదటి ఆశీర్వాదమునకు వారసులమై, అనేకులకు ప్రయోజన కరమవుతాము.

ఎంతో మంది స్త్రీల గురించి బైబిల్ గ్రంథము మనకి వివరిస్తుంది. ఒక్కొక్కరు ఒక్కొక్క స్వభావముతో, ప్రవర్తనతో మనతో మాట్లాడుతున్నవారు. మరి కొందరు మౌనంగా వాక్యమును చేయుచూ, కుటుంబములలో అనుకూలముగా జీవిస్తూ ఆదర్శంగా నిలిచిన వారు. ఇలాంటి వారిలో మొట్టమొదటి స్త్రీ, దేవుని స్పర్శ అనే మన ద్విమాస పత్రికలో మనం ధ్యానించబోతున్న స్త్రీ నోవహు భార్య.

నోవహు అనగా నెమ్మది అనే అర్థమును లేఖనములు మనకి తెలియచెప్పుచున్నవి. లెమెకు నూటఎనుబది రెండేండ్లు బ్రదికి ఒక కుమారుని కని, భూమిని యెహోవా శపించినందు వలన కలిగిన మన చేతుల కష్టము విషయములోను, మన పని విషయములను ఇతడు మనకు నెమ్మది కలుగజేయుననుకొని అతనికి నోవహు అని పేరు పెట్టెను – ఆది 5:28

చేతుల కష్టము, పని విషయములో నెమ్మది కలగాలని తండ్రియైన లెమెకు కోరుకున్నాడు కానీ నోవహు దేవుని హృదయమునకు నెమ్మది కలిగించిన వాడిగా ఉన్నాడు. నోవహు కాలము ఏ విధంగా ఉంటే **"నరుల చెడుతనము భూమి మీద గొప్పదనియు, వారి హృదయము యొక్క తలంపులలోని ఊహ అంతయు ఎల్లప్పుడు కేవలము చెడ్డదనియు యెహోవా చూచి, తాను భూమి మీద నరులను చేసినందుకు యెహోవా సంతాపము నొంది తన హృదయములో నొచ్చుకొనెను. – ఆది 6:5,6**

భూమి మీద నరులందరూ దుష్టత్వముతో నిండి వారి ఊహలు కూడా దేవునికి బాధ కలిగించేవిగా ఉన్న ఆ దినములలో దేవుడు నోవహుని చూచినప్పుడు అతని మీద ప్రేమ, జాలి కలిగాయి కారణం నోవహు నీతిపరుడును తన తరములో నిందారహితుడై

యున్నాడు. “ **అప్పుడు యెహోవా - నేను సృజించిన నరులను నరులతో కూడ జంతువులును పురుగులును ఆకాశ పక్ష్యాదులును భూమిమీద నుండకుండ తుడిచివేయుదును; ఏలయనగా నేను వారిని సృష్టించినందుకు సంతాపము నొందియున్నాననెను. అయితే నోవహు యెహోవా దృష్టియందు కృప పొందినవాడాయెను. - ఆది 6:7,8**

నోవహుని బట్టి అతని కుటుంబము కూడా కృప పొందినదైంది. కుటుంబ యజమాని కృప పొందిన వాడైతే కుటుంబమంతా కృప పొందినట్లే. నోవహు భార్య గురించి బైబిల్ గ్రంథములో ఒక్క మాట కూడా వ్రాయబడలేదు కానీ దేవునితో అతను నడవడానికి, అతని భక్తికి, యధార్థతకి, నిందారహిత జీవితమునకు ఏ మాత్రం అడ్డుగా ఉండక, భర్తకి అనుకూలంగా జీవిస్తూ, కుటుంబము అంతా దేవుని చేతులలో ఇమిడే విధంగా చేసిన యోగ్యురాలైన స్త్రీ. వీరికి ముగ్గురు కుమారులు. వారు షేము, హాము, యాపేతు అనువారు.

కొందరు స్త్రీలు, నోవహు భార్య వలెనే, కుటుంబములో ప్రేమను పంచుతూ, దేవునితో సఖ్యతగా ఉంటూ, ఐక్యతను కలిగి, బిడ్డలను దేవునిలో పెంచాలనే ఆశతో బాహ్య పరిస్థితులతో సంబంధం లేకుండా నెమ్మదిగా జీవిస్తూ ఉంటారు. వారిని దేవుని కృప ఆవరించి నడిపిస్తుంది.

**దేవుడు నోవహుతో - సమస్త శరీరుల మూలముగా భూమి బలాత్కారముతో నిండియున్నది గనుక నా సన్నిధిని వారి అంతము వచ్చియున్నది. చితిసారకపు మ్రానుతో నీ కొరకు ఓడ చేసికొనుము - ఆది 6:13-19** అని దేవుడు నోవహుకి ఓడ చేయడానికి కొలతలని ఇచ్చారు. దేవుడు చెప్పిన కొలతల ప్రకారం ఓడను చేయడానికి నోవహు అంగీకరించి పనిని ప్రారంభించాడు. మనము చాలాసార్లు దేవుడు నోవహుని ఓడకట్టమన్నారు, ఓడ కట్టారు, జలప్రళయం వచ్చింది, నోవహు కుటుంబం రక్షించబడింది అని చాలా తేలికగా మొదలుపెట్టి, ముగిస్తాము. కానీ ఆ పని ఎంత ప్రయాసతో, కష్టముతో కూడుకున్నదో ఎప్పుడైనా ఆలోచించామా?



ఓడ తయారీకి కావలసిన సామాగ్రిని సిద్ధపరచడం ఒక రకంగా ప్రయాసతో కూడిన పని ఐతే, రానైయున్న ఉగ్రతను గురించి ప్రకటన చేసినప్పుడు, చుట్టూ ఉన్నవారి హేళనతో కూడిన మాటలను, అవమానములను సహించడం మరొక గొప్ప విషయం. ఇది ఒక రకంగా మానసికంగా కలిగే ఒత్తిడి. వీటన్నింటినీ చేయడం నోవహు ఒక్కడి వలనే సాధ్యమైందా? అని ఆలోచిస్తే కుటుంబములోని భార్య బిడ్డల పాత్ర, సహకారం కూడా ఎంతో ఉండుట వలనే ఇది సాధ్యమైంది అని అనిపిస్తుంది. సమస్త జంతువులు, పశుపక్ష్యాదులు, ప్రాకు జీవులు -

వీటన్నిటితో పాటుగా నోవహు కుటుంబము ఓడలోనికి ప్రవేశించింది. 40 దినములు వాటితో పాటుగా ఆ ఓడలో నివసిస్తూ, వాటిని చూచుకుంటూ, వాటి కొరకు పని చేస్తూ ఉండడం ఎంతో కష్టమైన విషయము. ఈ విషయములన్నింటిని బట్టి నోవహు భార్య కష్టపడి పనిచేసే స్వభావము గల స్త్రీ అని గ్రహించగలము. పరిస్థితులను బట్టి భర్త మీద సణిగినట్లుగా, కోడళ్ళతో గొడవపడినట్లుగా గాని చెప్పబడలేదు. ఆమె భక్తి, ప్రార్థన బాగా చేసిందని కాదు గాని, ఆ సమయములో భర్తకు అనుకూలంగా జీవించి, దేవుని ఉన్నతమైన ఉద్దేశ్యములకు, ఆయన ప్రణాళికకు అనుగుణంగా ప్రత్యేకమైన కుటుంబముగా ఏర్పరచడానికి తన వంతు సహకారమును అందించిన స్త్రీ.

సాధారణముగా స్త్రీలు కుటుంబములలో ఒక విధమైన పరిస్థితులకు అలవాటు పడిపోతుంటారు. ఆ పరిస్థితులలో కొంచెం మార్పు కలిగితే లేక ఉన్న పరిస్థితులను కోల్పోయి, వేరే విధమైన పరిస్థితులలో జీవించవలసి వస్తే అనగా ప్రస్తుతం ఉన్న స్థితిలో కొంచెం మార్పు కలిగితేనే ఎంతో ఇబ్బందిగా ఫీల్ అవుతారు. అప్పుడు దేవుడు నోవహుకి అప్పగించిన పనిని ఈ దినమున మన కుటుంబములకు అప్పగించబడితే సణగకుండా, సహనంతో చేసిన నోవహు భార్య వలె ఆ పనిని పూర్తి చేసేవారు ఎంతమంది ఉంటారు ? ఎన్ని సణుగులు, చిరాకులు కలుగుతాయో.

కుటుంబములో పరిస్థితులు మారినప్పుడు, వాతావరణం భారమైనప్పుడు ప్రతి స్త్రీ తన మాటతో, స్వభావముతో వాతావరణమును తేలిక చేస్తూ ఉండాలి. పరిస్థితులకు అనుగుణంగా నడుచుకోవాలి.

చాలా మంది స్త్రీలు తమకి వచ్చే ఆదాయమును బట్టి జీవించక, ఆడంబరములను కోరుతూ ఉంటారు. ఇది జీవితములను, కుటుంబములను నష్టపరుస్తుంది.

కనుక ప్రియమైన వారలారా ! పరిస్థితులు ఏ విధంగా ఉన్ననూ, ఎలాంటి మార్పు కలిగిననూ, దేవుని యొక్క ఉద్దేశ్యము, ఆయన ప్రణాళిక మన పట్ల, మన కుటుంబముల పట్ల ఉన్నదని గ్రహించి అవి బయలుపడినప్పుడు పరిస్థితులను బట్టి దేవుని చేతిలో ఒదిగి ఆశీర్వదించబడుతూ, అనేకులకు ప్రయోజనకరమైన వారమవుదాము.

అట్టి కృప దేవుడు మనకి అనుగ్రహించును గాక!



# సాధు సుందర్ సింగ్ జీవిత చరిత్ర

**- సీరియల్ 36వ భాగము**

ఇంతకు ముందు నేను వ్రాసిన దాని వలన మీలో కొందరు ఇది కేవలం ఒక కలయని నేను ధ్యానములో నిమగ్నమై యున్నపుడు ఎవరో వృద్ధుడు వచ్చి నాతో మాట్లాడి యుంటాడని, వాస్తవానికి అలాంటి వ్యక్తి లేడని తలంచుచున్నారు. మీరు తలంచేదే నిజమని మన వాళ్ళు నమ్మినట్లైతే మన రక్షణ దాని మీద ఆధారపడదు. నమ్మనందు వలన నష్టమూ లేదు. ఎక్కడైననూ సరే ఎల్లవేళలా మనకు తోడుగా నుండు దేవుని నుండే మనకు రక్షణ. గొర్రెల్లాగా మీరు తలలూపడం నాకు ఇష్టం లేదు. మీకు ఇష్టం వచ్చినట్లుగా అనండి మీ దాసుడు మౌనంగా వాటిని ఆలకించి మీ క్షేమం కోసం ఇంకనూ ప్రార్థిస్తూనే ఉంటాడు. ఈలాంటి మాటలు వ్రాసిన తరువాత తాను మొట్టమొదటిగా మహర్షిని కలిసికొన్న సంఘటనను క్లుప్తంగా వివరించి మహర్షిని స్వయంగా చూడాలని కోరేవారు నాతో రావచ్చునని వ్రాశారు. దీని ఫలితంగా భారతీయులు, ఆంగ్లో ఇండియన్‌లు నలుగురు కలిసి 1917 వసంత కాలములో సుందర్‌తో బయలుదేరారు. ప్రయాణం చాలా కష్టంగా ఉండునని, ఎన్నో సెలయేర్లు దాటాలనీ, ఎన్నో శ్రమలు కష్టములు ఎదుర్కొన వలసి యుంటుందనీ వారికి ముందుగానే చెప్పాడు. వారిలో ఒకరు రెండు రోజుల తరువాతే వెనుకకు తిరిగి పోగా డెహ్రాడూన్ నుండి బయలుదేరి 10దినముల ప్రయాణం తరువాత 4వ వ్యక్తి కూడా వెనుకకు వెళ్ళిపోయాడు. కాగా సుందర్ ఒక్కడే తన ప్రయాణమును కొనసాగించాడు.

ఈ సారి అల్మోరా మీదుగా ప్రయాణం చేస్తూ లండన్ మిషనెరీ సంస్థలో సేవ చేస్తున్న యానస్‌సింగ్‌ను కలిసికొన్నాడు. ఇతడు కూడా టిబెట్ వెళ్ళాడు. అతడు ఒక పటమును చూపి సుందర్ వెళ్ళిన స్థలములను చూపమంటే సుందర్ వాటిని చూపించాడు. ఆయా ఊళ్ళ పేర్లు చెప్పున్నప్పుడు అవి తనకింతకు మునుపే తెలుసు గనుక యానస్ తలపంకించాడు. ఇతనిని కలుసుకోవడం సుందర్‌కి ఎంతో సంతోషమును కలిగించింది. కొద్ది రోజుల తరువాత టిబెట్‌కు ప్రయాణమైన సుందర్‌కి జ్వరం వచ్చింది. తీవ్రంగా వీచుచున్న చలిగాలుల నుండి కాపాడుకోవడానికి ఎక్కడా తావు దొరకలేదు. తాను ఒంటరినని, ఏటవాలుగా నున్న ఆ కొండలపై ఇంకా 7 మైళ్ళు ఎక్కి పోవాలని సుందర్‌కు తెలుసు. ఎక్కిపోవాలి లేదంటే అక్కడే ఉండి చనిపోవాలి. అక్కడే నిలిచి కావలసిన శక్తి కోసం ప్రభువుని వేడుకున్నాడు. ప్రయాణం చేయగల బలం తనకు వచ్చిందా లేదా అని చూడకుండానే ఎక్కనారంభించాడు సుందర్. విశ్వాసముతో ముందుకి సాగిపోవుచున్నప్పుడు ఫలితాలు అనూహ్యంగా ఉంటాయి. ఇలా ఎక్కి పోవుటలోని ప్రయాస వలన నా బట్టలు తడిచిపోయేటంతగా చెమట పట్టడంతో గమ్యం చేరే సరికి బాగైపోయాను. ఈ చెమట వలన జ్వరం కూడా మాయమైపోయింది. మంచం ఎక్కి మందులు తీసుకోనారంభించి యుంటే ఆ

జ్వరం నన్ను ఎంత కాలం కష్టపెట్టి యుండేదో నన్నాడు సుందర్.

అలా ముందుకు సాగి ఓ గ్రామానికి వచ్చేసరికి ఒళ్ళు జలదరింపజేసే దృశ్యమును చూచాడు సుందర్. ఆ గ్రామస్తులు ఓ పెద్ద సంతలాగా చేరి ఒక దున్నపోతును హింసిస్తూ, పదునైన కత్తులతో గాయపరుస్తూ, ఆ గాయాల్లో కారం చల్లుతుంటే, అది భరించలేని బాధతో నాలుక బయటకు చాచి పిచ్చిగా అటు ఇటు పరిగెత్తుచుంటే క్రూరులైన ఆ ప్రజలు సంతోషించుచుండినారు. అలా చేస్తే తమ పాపములు పరిహారమౌతాయని వారి నమ్మకం. ఆ దున్నపోతు అలసటతో పడిపోగా అది చచ్చిపోయేంత వరకు దానిని కర్రలతో కొట్టి, దాని రక్తమును తమ దేవతకి అర్పించారు. దీనిని చూస్తున్న సుందర్‌కు యేసుప్రభువు కళ్ళ ముందే కదిలాడు. క్రీస్తు కూడా ఇలాగే మనుష్యుల చేతులతో శ్రమ పొందాడనే మాటలు అప్రయత్నంగానే అతని పెదవుల నుండి వచ్చాయి. మేకల, లేగదూడల రక్తం వలన కాదు గాని దేవుని కుమారుని రక్తం వలననే రక్షణ కలుగునని వారికి చెప్పాడు. ఈ సంతలోని వారికి సువార్తని అందించడానికి మంచి తరుణములు ఉండినాయి గాని అల్మోరాకి 20 మైళ్ళ దూరములోని అస్కోట్ అరణ్యములో ఉంటున్న ఈ శాంట్ తెగవారు క్రూరమైన వారు గనుక సువార్త నందించలేక పోయాను అని చెప్పాడు సుందర్. దారి పొడవునా సువార్త ప్రకటిస్తూ, ఈ ప్రజల దగ్గరకు వెళ్ళినప్పుడు, వారి ముఖాలే ఎంతో క్రూరంగా ఉన్నాయి. వీరిలో కొద్దిమంది దుస్తులు ధరించిననూ, చాలమందికి మొల చుట్టూ ఓ చిన్న పీలిక (గోచీ) తప్ప వేరే ఆచ్ఛాదనం లేదు. ఆ అడవిలో ఇంకా లోపలకు వెళ్తే ఎన్నో వింత పరిస్థితులున్నాయి. సుందర్ ఒంటరిగా నడుస్తూ ఉండగా, అప్పుడు ఒక గుహలో నుండి నలుగురు పిల్లలు గుర్రాల కంటె వేగంగా పరిగెత్తుకుంటూ బయటకు వచ్చారు. వారందరూ దిగంబరులుగా ఉన్నారు. ఇళ్ళ దగ్గరకు రావాలంటేనే వారు భయపడుచూ ఊరికి దూరంగా ఉంటున్నారు. సుందర్‌ని చూచి వీరు పారిపోయారు. ఇతరులు భయపడ్డారు. ఈ క్రూర జనుల మధ్య కొద్దిరోజులుందామని అనుకున్నాడు గాని ఆయన దగ్గరకు రావాలంటేనే వారు భయపడుతుండడంతో ఇక లాభం లేదనుకొని కైలాస పర్వతం వైపు కదిలిపోయాడు. అతడు మహర్షిని దర్శించడం ఇది మూడవసారి.

సేకరించబడింది

(ఇంకా ఉంది)




 మనం గొప్ప పనులు చేయలేకపోవచ్చు. కానీ గొప్ప ప్రేమతో చేసిన పని ఎంత చిన్నదైనా ...అది గొప్ప పనే అవుతుంది.

# అపాయములో ఉపాయము

పిల్లలూ! ఎలా ఉన్నారు? బాగా చదువుతున్నారా? మీరు ఇప్పుడు బాగా చదువుకోకపోతే ఈ సమాజంలో బ్రతకడం చాలా కష్టం సుమా? ఎన్నో మోసాలు, దగాలు, కుయుక్తులు ఉన్న సమాజం మనది... కాబట్టి మీరు బాగా చదువుకుని జ్ఞానంతో నడుచుకుంటే ఎలాంటి ప్రాబ్లమ్స్ రావు. మనము తెలివి కలిగిన వారమైతే మనల్ని మనం కాపాడుకుంటాము, ఇతరులకు కూడా సహాయం చేయగలము. మీకు ఒక మంచి స్టోరీ చెబుతాను ఎవరు తెలివి గలవారో చెప్పండి చూద్దాము....

అనగనగా ఒక అడవిలో కొంగ ఒకటి ఉండేది. ఆ అడవిలోనే ఉన్న చెఱువులో చేపలను వేటాడి జీవనం సాగిస్తూ ఉండేది. అలా కొద్ది రోజులు గడిచిన తరువాత కొంగ ముసలిదైపోవడం వలన దాని శక్తి సామర్థ్యాలు తగ్గి, కంటి చూపు కూడా మందగించి, చేపలను వేటాడటం కష్టమైపోయింది. కొన్నిసార్లు పస్తులు కూడా ఉండవలసి వచ్చేది. ఒకరోజు కొంగ బాగా ఆలోచించి...ఇలా అయితే లాభం లేదు ఇప్పటికే చేపలు తిని రెండు రోజులు అయ్యింది ఏదో ఒకటి చేయాలి, నీరసం వస్తుంది అని ఒక ఉపాయం కనిపెట్టి, ఆ చెఱువు ప్రక్కనే రాయి మీద ఒంటికాలితో జపం చేయటం మొదలు పెట్టింది. అటుగా వచ్చిన చేపలు కొంగను చూసి ఆశ్చర్యపోయాయి. తమ ఉబలాటాన్ని ఆపుకోలేక "కొంగమహాశయా! నీకు ఏమైంది? అలా ఒంటి కాలి మీద చాలా గంటల నుండి నిలబడ్డావు? కాలు నొప్పిగా లేదా?" అని అడిగాయి. వెంటనే కొంగ.. "ఏం చెప్పను? నొప్పిగానే ఉంది కానీ ఏం చేయను? మీ సుఖం కోసమే ఇలా చేస్తున్నాను" అని అంది. అప్పుడు చేపలు "మా సుఖం కోసమా! మేము ఇప్పుడు బాగానే ఉన్నామే!! అస్సలు ఏం జరిగింది?" అని అడిగాయి.



"నాకు రాత్రి ఒక కల వచ్చింది. ఆ కలలో జల దేవత వచ్చి నాతో ఇలా అంది... ఈ చెఱువు త్వరలో ఎండిపోబోతుంది. ఇందులో ఉన్న జీవులన్నీ నీరు, ఆహారం లేక ఆకలితో అలమటించిపోతాయి. దాని కోసం నీవు తపస్సు చేయాలి అని నన్ను ఆదేశించింది. అందుకే పెద్ద దిక్కుగా ఉన్న నేను మిమ్మల్ని కాపాడటం నా బాధ్యతగా భావించి, జపం చేస్తున్నాను."

"కొంగగారు! దీనికి పరిష్కారం ఆలోచించండి. మాకు భయంగా ఉంది. మేము భయంతోనే చనిపోయేలా ఉన్నాము!!' అన్నాయి చేపలు. "దీనికి పరిష్కారం ఉంది. ఇక్కడికి కొంచెం దూరంలో పెద్ద సరస్సు ఉంది. అక్కడైతే మీరు ఏ బాధా లేకుండా ఉండవచ్చు." "మరి మేము అంత దూరం ఎలా వెళ్ళగలము? నీళ్ళు విడిచి కొద్ది సేపు కూడా మేము బ్రతకలేమని నీకు తెలుసు కదా!!" అన్నాయి చేపలు.

topwalls.net

"నేను నా ముక్కుకు కరచుకొని మీలో ఒక్కొక్కరిని ఆ సరస్సు దగ్గరకి తీసుకువెళతాను." "అమ్మో! నీవు మమ్మల్ని తినేస్తావు?" "అయ్యో! నేను మిమ్మల్ని తింటానా? మీ కోసమే ఒంటి కాలిపై జపం చేస్తూ కేవలం శాఖాహారమే తింటున్నాను. కావాలంటే మీలో ఒకరు రండి. నేను మరల ఇక్కడికి క్షేమంగా చేరుస్తాను", అంది కొంగ. "వద్దులే కొంగగారు! నీపై మాకు నమ్మకముంది" అని చేపలన్నీ చెప్పాయి.

ఇక ఆ కొంగ ఒక్కొక్క చేపను అడవిలోనికి తీసుకువెళ్ళి యధేచ్ఛగా తన ఆకలిని తీర్చుకోసాగింది. అలా ఆ సరస్సులోని ఎన్నో చేపలు దాని కుటిలబుద్ధికి బలైపోయాయి. "కొంగగారు! కొంగగారు! మా స్నేహితులు ఉన్న చోటికి నన్ను తీసుకువెళ్ళవా? ఇక్కడే ఉంటే నేను ఆకలితో చచ్చిపోతానేమో!" అని ఎండ్రకాయ కొంగను అడిగింది. "ఎందుకు తీసుకు వెళ్ళను? తప్పకుండా తీసుకు వెళతాను." అని దాని ముక్కుతో ఎండ్రకాయను కరచుకొని అడవివైపుకి వెళుతుంది. సరస్సు అటువైపు కదా ఉంది, ఇటు అడవిలోకి తీసుకువెళ్తుంది ఏంటి? అని ఎండ్రకాయ మనసులో అనుకొని, కొంగగారూ! మీ ముక్కుతో నన్ను పట్టుకోవడం వలన నాకు ఏదోలాగ ఉంది, మీ మెడ చుట్టూ చేతులు వేసి పట్టుకుంటాను, అని చెప్పి కొంగమెడ చుట్టూ చేతులు వేసి పట్టుకొని వేళ్లాడసాగింది. ఎడ్రకాయను తిందామని మెడను క్రిందికి దించగానే ఎండ్రకాయ కత్తెరలాంటి చేతులతో మెడ కొరికి చంపేసింది. ఎండ్రకాయ సరస్సుకి వెళ్ళి జరిగిన విషయాన్ని మిగతా చేపలతో చెప్పింది.



పిల్లలూ! చూశారా? కొంగగారి కుటిల తెలివి? దాని ఆహారం కోసం ఎంత ప్లాన్ వేసి చేపలను నమ్మించింది. ఎదుటి వారికి హాని చేసే బుద్ధిని కుటిలబుద్ధి అంటారు. కొంగ కుటిలబుద్ధి చూపి దాని ప్రాణం మీదకు తెచ్చుకుంది, చనిపోయింది. ఇక చేపలు అంటారా తెలివి తక్కువ చేపలు.. కొంగతో ముందుగా ఎండ్రకాయను పంపితే ఏ బాధా ఉండేది కాదు కదా!! అవి బతికిపోయేవి..

అందుకేనర్రా మనకి తెలివి, ఉపాయం చాలా అవసరం. మరి ఇవి మనకు కావాలంటే బాగా చదువుకోవాలి, దేవుని యందు భయభక్తులు ఉండాలి. మన స్టోరీలో ఎండ్రకాయ తెలివిగా ప్రవర్తించి హీరో అయిపోయింది. మరి మీరు కూడా అపాయంలో ఉపాయంగా ఉండే హీరోస్ అయిపోతారుగా !!

ప్రేమతో ... మీ అక్కయ్యా !

# “నా జీవితములో దేవుని మేలులు”

- శ్రీనివాస్, వరంగల్

ప్రభువైన యేసుక్రీస్తు నామములో వందనములు. నా పేరు శ్రీనివాస్, మాది వరంగల్ జిల్లా రాంపూర్ గ్రామము. నా చిన్న వయస్సులోనే మా అమ్మ అనారోగ్యం కారణంగా యేసుప్రభువును నమ్మి విశ్వసించింది. ఆ విధంగా నేను కూడా మా అమ్మతో ప్రార్థనలకు వెళ్ళేవాడిని. అక్కడ వాళ్ళు పాడే పాటలు నాకు చాలా సంతోషమును కలిగించేవి. అందుకే నేను క్రమంగా చర్చికి వెళ్ళేవాడిని . 10వ తరగతి తరువాత స్నేహితులతో కలిసి సినిమాలకు వెళ్ళేవాడిని. ఇంటర్‌లో ఫెయిల్ అయ్యి ఇంటి వద్దే ఉంటూ వ్యవసాయం చేస్తూ ఉన్నప్పుడు దైవసేవకులు మా ఊరి వైపు వచ్చినప్పుడు ప్రార్థనలకు వెళ్ళేవాడిని. 2002వ సంవత్సరములో నేను మారుమనస్సు పొంది, బాప్తిస్మము తీసుకోవడం జరిగింది. తరువాత నాకు మా ప్రక్క గ్రామములో ఆదివారం ఆరాధనని నడిపించమని ఆ సేవకులు అప్పగించారు. అలా వెళ్తున్నప్పుడు సేవ చేసే కొందరు సహోదరులు ప్రోత్సహించడం, నాకు సేవ చేయాలనే ఆశ ఉండడం ద్వారా, సేవ కోసం అని మమ్ములను నడిపిస్తున్న సేవకుల దగ్గరకు వెళ్ళాను. ఆయన దగ్గర ఇంచుమించుగా 6సం॥ల కంటే ఎక్కువగా పని చేశాను. అదే సమయములో నా వివాహం కూడా జరిగింది. తరువాత నా భార్యకు 3 సార్లు అబార్షన్ అయ్యింది. దేవుని సేవ అని తిరుగుచున్న నేను భూసంబంధమైన మేలుల గురించి ఎక్కువగా చెప్తుండేవాడిని. అందుకే నా భార్యకు అబార్షన్ అయిన దాని కంటే బంధువులకు, విశ్వాసులకు ఏమి సమాధానం చెప్పాలి? అని ఎక్కువగా బాధపడ్డాను. నేను ఏదో పొరపాటు చేయడం ద్వారా ఇలా జరిగిందని సంఘస్తులు అనుకుంటారు, ఇక బంధువులు దేవుని గూర్చి తక్కువగా మాట్లాడుతారు అని చాలా వేదన కలిగేది. అంతేకాక సేవకులు చెప్పే మాటలు వింటుంటే నేను ఎందుకు సేవకు వచ్చానా? విశ్వాసిగా ఉంటే బాగుండేది అనుకునేవాడిని. సేవకుల యెడల సంతృప్తిగా ఉండేవాడిని కాదు, ఎప్పుడూ సణుగుతూ, ఆచారభక్తిగా సేవ చేస్తూ ఉండేవాణ్ని. కొన్ని కారణముల వలన 2011 వ సం॥ ఆ సంఘం నుండి బయటికి వచ్చాను. అయితే నేను నేర్చుకున్న బోధ ప్రకారం ఇంటికి వెళ్ళి వ్యవసాయం పని చేసుకోకూడదు. ఒకవేళ అలా చేస్తే శాపం వస్తుందని చెబుతూ ఉండేవారు. దాని వలన భయముతో ఏం చేయాలో అర్థం కాకుండా ఉన్న సమయములో మా బాబాయి హైదరాబాద్‌లోని మన ఎపఫ్రా మినిస్ట్రీస్‌కు వస్తున్నాడు. ఆయన నాకు పరిచర్యను గురించి చెప్పి, ఒకసారి నన్ను హైదరాబాద్ తీసుకువచ్చి, దైవసేవకులకు పరిచయం చేసి, నా గురించి చెప్పాడు. దైవసేవకులు నాకు సేవను గూర్చి కొన్ని విషయములు చెప్పి, పనిచేయడం తప్పు కాదని చెప్పారు. అప్పుడు అనాజ్‌పూర్‌లో యూత్ మీటింగ్ జరుగుతుంటే నన్ను ఆ యూత్ మీటింగ్‌లో ఉండమన్నారు. ఇక్కడి క్రమం, బోధించే మాటలు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. ఆ తరువాత నేను, నా కుటుంబముతో

topwalls.net

హైదరాబాద్ వచ్చి, ఒక కంపెనీలో జాబ్‌లో జాయిన్ అయ్యాను. దైవసేవకులు చెప్పే మాటలు, పరిచర్యలో ఉన్న సహోదరులు చూపే ప్రేమ నాకు చాలా ఆనందమును కలిగించాయి. ఆ తరువాత మినిస్ట్రీ ఆఫీసులో పని కొరకు నన్ను నియమించారు. ఆచార క్రైస్తవుడిగా ఉన్న నేను ఈ పరిచర్య ద్వారా విశ్వాస జీవితం నేర్చుకున్నాను. మన పరిచర్యకు వచ్చాక దేవుడు మాకు ఒక బాబును ఇచ్చారు. ఇప్పుడు పరిచర్యలో పరిచారకులతో కలసి పనిచేసే భాగ్యమును దేవుడు అనుగ్రహించారు. దేవునికి, ఇతరులకు ప్రయోజనకరంగా జీవించాలని బోధించిన వాక్యముల వలన నా మట్టుకు నేను అలా జీవించాలనే ఆశ కలిగింది. నేను ఎన్నో తప్పిదములు చేసిననూ దైవసేవకులు నన్ను క్షమించేవారు. ఆత్మీయంగా పూర్తిగా చచ్చిన స్థితిలో ఉన్న నేను శని, ఆదివార, ఉపవాస ప్రార్థనల ద్వారా బలపరచబడ్డాను. ఇంత మంచి పరిచర్యను నాకు చూపించి, పరిచర్యలో నిలిపి ఉంచిన దేవునికి నా స్తోత్రములు.

నా జీవితకాలమంతా దేవునికి మరియు ఇతరులకు ప్రయోజనకరంగా ఉండాలని, ఏ ఒక్కరికి ఇబ్బంది కరంగా ఉండకూడదని కోరుకుంటున్నాను. చివరి శ్వాస వరకు నేను నా కుటుంబం దేవునిలో, పరిచర్యలో నిలిచి ఉండాలని, దేవుడు మమ్మును నిలిపి ఉంచునట్లుగా మా కొరకు ప్రార్థించమని కోరుకుంటున్నాను.


## ముఖ్య గమనిక:

మీ ప్రార్థనావసరతలకై **ఎపఫ్రా మినిస్ట్రీస్** ఆఫీసు నందు
సోమవారం నుండి శనివారం వరకు
ఉదయం 10.30 గం॥ల నుండి సాయంత్రం 6.30 గం॥ల
వరకు సంప్రదించగలరు.

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070
Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com

**ఎపఫ్రా మినిస్ట్రీస్ పాటలు మరియు ప్రసంగముల సి.డి.లు కావలసినవారు మమ్ములను సంప్రదించగలరు.**

# విశ్వాసంలో ఎదుగుట

**వినడం వలన విశ్వాసం పెరుగుతుంది:**

"దేవుని మాట వినడం వలన విశ్వాసం కలుగుతుంది" అనే వచనం మనతో దేవుడు మాట్లాడే ఆత్మగతమైన అనుభవమును ప్రస్తావిస్తున్నది. ఒకవేళ బైబిల్‌లో ఉన్న ఒక వచనం ద్వారా గాని పూర్వకాలంలో ప్రవక్తలతో మాట్లాడినట్లు గాని ఏ రీతిగానైనా దేవుడు తప్పక మాట్లాడతాడు. ప్రవక్తలు స్వరమును వినడం ద్వారా లేదా మనసులో వినడం ద్వారా, కల ద్వారా, దర్శనం ద్వారా, దూత దర్శనం ద్వారా లేక అభిషేకించబడ్డ దైవసేవకుని నోటి మాట ద్వారా ఏదో విధంగా దేవుడు వారికి వార్తనందించాడు. ఈ వార్తా ప్రసారాన్నే బైబిల్ "దైవవాక్కు" అని పేర్కొంటున్నది.

వ్రాసి నిక్షిప్తం చేసిన వాక్కు లిఖిత వాక్కు. పలుకబడిన వాక్కు దేవుని జీవ వాక్యం. దైవ వాక్కును వినడమంటే ఏమిటో ఇంకా వివరంగా అర్థం చేసుకోవడానికి ముందు ఈ రెంటి మధ్యనున్న వ్యత్యాసాన్ని మనం తెలుసుకోవడం అవసరం.

"వినుట వలన విశ్వాసం కలుగును" అని పౌలు చెప్పినప్పుడు, అతడు కేవలం లిఖిత లేఖనాన్ని గూర్చి మాత్రమే ప్రస్తావించడం లేదు.

అపో.కా 17:11 ఈ అంశాన్ని బలపరుస్తున్నది. "వారు... ఆసక్తితో వాక్యమును అంగీకరించి... చెప్పిన సంగతులు అలాగున్నవో లేవో అని ప్రతి దినమును లేఖనములను పరిశోధించుచు వచ్చిరి". ఈ వాక్యంలోని లేఖనములను అనే మాటలు పాత నిబంధనలోని ఆదికాండము నుండి మలాకీ వరకు ఉన్న గ్రంథాల్ని సూచిస్తున్నాయి. అప్పటికి వారికి కొత్త నిబంధన లేదు. అది దాదాపు వంద సంవత్సరాల తరువాత వచ్చింది. కనుక ఈ వచనంలోని "లేఖనములు" మాట లేదా వాక్యము" అన్న రెండు పదాలు భిన్నమైనవి. "లేఖనము అంటే పాత నిబంధన. వారు వాక్యాన్ని అంగీకరించి లేఖనాలను వెదికారు.

వ్రాయబడిన లేఖనానికి, పలుకబడిన దైవవాక్కుకు గల తేడాకు 1 థెస్సలోనీక 2:13లో మరొక నిదర్శనాన్ని చూస్తాం. ".... మీరు దేవుని గూర్చిన వర్తమాన వాక్యము మా వలన అంగీకరించినప్పుడు, మనుష్యుల వాక్యమని ఎంచక అది నిజముగా ఉన్నట్టు దేవుని వాక్యమని దానిని అంగీకరించితిరి..."

ఇక్కడ 'దేవుని వాక్యము' అంటే దైవాభిషేకాన్ని పొందిన జనుల నోటి ద్వారా ప్రకటించబడ్డ బోధ. దేవుని దగ్గర నుండి సూటిగా వచ్చిన జీవ వాక్యంగా దీనిని థెస్సలోనీకవారు అంగీకరించారు.

అపొ.కా 3:6లో శృంగారమనే దేవాలయపు ద్వారం వద్ద పేతురు కుంటివానితో నాకు కలిగినదే నీకిచ్చుచున్నాను; నజరేయుడైన యేసుక్రీస్తు నామమున నడువుమని" చెప్పినప్పుడు అతడు ఉచ్ఛరించిన జీవ వాక్కుల ద్వారా ఆ మనిషికి స్వస్థత కలిగింది. మానవ ఉపకరణమైన అభిషిక్త దైవసేవకుని నోటి ద్వారా వెలువడినది ఆ కుంటివానికి "దైవవాక్కు" గా మారింది.

నేడు కూడా దేవుడు మాట్లాడుతున్నాడు. ఈ కాలంలోనూ దేవుడు పరిశుద్ధాత్మ ద్వారా లిఖిత లేఖనాల మూలంగా, అభిషేకించబడ్డ తన సేవకుల ద్వారా, కలలు, దర్శనాలు, అంతరంగంలో నిశ్చయత, దైవానుగ్రహం లేదా పరిస్థితుల ద్వారా మనతో మాట్లాడుతున్నాడు.

దేవుడెన్నడూ మన వ్యక్తిగత అనుభవ పరిధిలో తన లిఖిత లేఖనానికి విరుద్ధంగా ఉండేలా మాటలాడడు. అటువంటి అనుభవమంతా కూడా పరిశుద్ధాత్మ చేత పరిశీలించబడి ఆమోదం పొంది ఉండాలి. బైబిలు మూలంగా మాత్రమే కాక, ఇతర సాధనాల ద్వారా కూడా దేవుడు మాట్లాడితే ప్రభువు వాక్కు వినడానికి మన హృదయాన్ని తెరచి ఉంచడం అవసరం.

ఆయన స్వరాన్ని వినండి. "చెవి గలవాడు ఆత్మ సంఘములతో చెప్పుచున్న మాట వినునుగాక" అని ప్రకటన 2,3 అధ్యాయాలల్లోని హెచ్చరికను మనం జాగ్రత్తగా గమనించాలి. ఇది ఏడుమార్లు పునరావృతమైంది. 'చెప్పుచున్న' అన్న వర్తమాన క్రియను గమనించండి. అంటే "ఆత్మ చెప్పుచున్న, చెప్తూ ఉండే దానిని వినండి" అని అర్థం.

ఇదే క్రియా పదాన్ని యేసుక్రీస్తు మత్తయి 4:4లో వాడినట్టు మనం చూస్తున్నాం. ..."మనుష్యుడు రొట్టె వలన కాదు గాని, దేవుని నోటినుండి వచ్చు ప్రతి మాట వలన జీవించును." తన లిఖిత లేఖనాల్లో చెప్పిన మాటవల్ల మాత్రమే గాక "ఆయన నోటి నుండి వచ్చుచున్న ప్రతి మాట వలన మనం జీవిస్తాము". ఆయన నోటి నుండి వస్తున్న మాట ద్వారా ఆయన మనతో ఏమి చెప్పాలని ఉద్దేశిస్తున్నాడో, ఆ మాట వినడం ద్వారా, దానికి లోబడడం ద్వారా మనం జీవిస్తున్నాము.

బైబిలు పుటల్లో వ్రాయబడిన మాటలతోనే గాక ఇంకా ఇతర విధాలుగా కూడా ఆయన మాట్లాడగలడన్న విషయాన్ని తిరస్కరిస్తే దేవునితో మన సంబంధం తెగిపోతుంది. మనలో ఆత్మీయ మరణం మొదలౌతుంది.

ఆయన స్వరాన్ని వినడానికి తిరస్కరించవద్దు. దేవుడు ఇశ్రాయేలీయులతో మాట్లాడినప్పుడు హెబ్రీ 12:19లో "ఆ ధ్వనిని (ఆయన మాటను) వినినవారు మరి ఏ మాటయు తమతో చెప్పవలదని బతిమాలుకొనిరి" దేవుని స్వరాన్ని వినడానికి వారు తిరస్కరించినపుడు, తమ విశ్వాసాన్ని పోగొట్టుకొన్నారు. ధర్మశాస్త్రం క్రింద వారు

మౌనులైపోయారు. అందువల్ల హెబ్రీ 12:25లో గ్రంథకర్త ఇలా హెచ్చరించాడు. "మీకు బుద్ధి చెప్పిన వానిని నిరాకరింప కుండునట్లు చూచుకొనుడి. వారు భూమి మీదనుండి బుద్ధి చెప్పుచున్న వానిని నిరాకరించినప్పుడు తప్పించుకొనకపోయిన యెడల, పరలోకము నుండి బుద్ధి చెప్పుచున్న (వర్తమాన క్రియావాచకం) వానిని విసర్జించు మనము తప్పించుకొనకపోవుట మరి నిశ్చయము గదా". చాలామంది ఈ రోజుల్లో "ఆయన చెప్పుచున్నాడు" అనే మాటను, "ఆయన ఇంకా చెప్తూనే ఉన్నాడు" అని నమ్మరు. అనేకులు ఇలా ప్రమాదానికి గురవుతున్నారు.

కొందరు అద్భుతాలు గత కాలానికి చెందినవి అని బోధిస్తుంటారు. వారు దేవుడు వాక్యంలో ఏమి చెప్పాడో దాన్ని మాత్రమే నమ్ముతారు. కాని, ఆయన ఇంకా చెప్తున్నాడు అని నమ్మరు. కనుక వారు ఈరోజు అద్భుతాన్ని చేసే దేవుణ్ణి తిరస్కరిస్తున్నారు. ఇలాటివారు లేఖనాల స్థాయికి తమ విశ్వాసాన్ని ఎదగనీయక, తమ అనుభవ స్థాయికి లేఖనాన్ని దిగజార్చడం వల్ల వారు అభివృద్ధి పొందని విశ్వాసపు స్థాయిలోనే ఉండిపోతారు.

ఒకవేళ మన "విశ్వాసం ఎదుగుతూ ఉండాలనుకుంటే, మన హృదయాలు, మన చెవులు ఆయన కొరకు తెరచుకొని ఉండాలి. ఈరోజు దేవుని మాట మనకు వినిపిస్తుందని నమ్మాలి. లేఖనాలలో ఉన్న ప్రకారం ఆయన చిత్తం మనకు తెలిసేందుకు పరిశుద్ధాత్మ నడిపింపును అంగీకరించాలి.

ఒకవేళ ఇశ్రాయేలీయులలాగా ఆయన స్వరమును తిరస్కరించకుండా దానికి లోబడితే మన జీవితాలలో విశ్వాసం అధికమవుతుంది. ఆయన స్వరం వినడం కొరకు సిద్ధంగా ఉండాలి. మనం ఇప్పుడు ఆయన స్వరం వినడానికి అధికంగా శ్రమపడనక్కరలేదు. దేవుడు మనతో మాట్లాడటం కొరకు మనం ఏమీ ఆచారకాండల్ని లేదా ఉత్సవాల్ని చేయనవసరం లేదు. మనం ఎంత మాత్రం ఎదురుచూడని సమయములలో దేవుడు తరచుగా మాట్లాడగలడు.

దేవుడు పరలోకం నుండి సూటిగా తన పరిశుద్ధాత్మ ద్వారా మనతో మాట్లాడగల సమర్థుడు. ఆయన మాట్లాడినప్పుడు మన ఆత్మ ద్వారా వినడానికి మనకూ సామర్థ్యం ఉంది. ఉదాహరణకు ఒక గది నిండా వందలకొలది శబ్ద సంకేతాలు రేడియోకీ, టీ.వికీ పంపబడినప్పటికిని మనం వాటిని వినలేం. టీ.వినో, రేడియోనో ఆన్ చేసేంత వరకు వాటిని వినలేం.

– ఇంకా ఉంది (సేకరించబడినది)

# ధనము విషయములో పేతురు వైఖరి

యేసు ఏర్పరచుకున్న పన్నెండు మంది శిష్యులలో ఎంతో వ్యత్యాసమున్న వ్యక్తిత్వములు పేతురు, ఇస్కరియోతు యూదావి అయి ఉండవచ్చు. పేతురు సామాన్యుడు, పామరుడు, దుడుకు స్వభావం గలవాడు. యూదా ఇస్కరియోతు తెలివిగలవాడు, సూక్ష్మబుద్ధి, ఉన్నత స్థితి కోరే మనస్సు గలవాడు. ఏది ఏమైనా యేసు పేతురును పిలిచినప్పుడు అతనికి దేవుని అద్భుత ప్రణాళిక గురించిన అవగాహన లేదు. దేవుడు తన ప్రణాళికను ఆయా సమయములలో కొంచెం కొంచెం వెల్లడి చేస్తాడు.



ఒకరోజు యేసు పేతురు పడవ ఎక్కి పడవను లోతుకు నడిపి, వలలు వేసి చేపలు పట్టమని అతనికి చెప్పాడు. పేతురు అలాగే చేసి, తన జీవిత కాలమంతటిలోనూ ఎన్నడూ పట్టనన్ని చేపలు పట్టాడు. (లూకా 5:1-11) ఒకవేళ పేతురు నేటి క్రైస్తవ వ్యాపారుల వంటి వాడైనట్లయితే, అతను యేసుతో ఇలా చెప్పి ఉండేవాడు, "ప్రభూ! ఇది అద్భుతం, నువ్వూ, నేనూ పార్ట్‌నర్స్‌గా (భాగస్వాములుగా) ఉందాం. నువ్వు బోధ చెయ్యి నేను నీకు ఆర్థికంగా సహాయమందిస్తాను. నా చేపల వ్యాపారం ఇలాగే ఉండేటట్లయితే, నేను త్వరలోనే ఇశ్రాయేలు అంతటిలోకి ధనవంతుడైన వ్యాపారినవుతాను. అప్పుడు నా దశమభాగాలు నీకు మాత్రమే కాదు, ఈ దేశములో, ఇతర దేశాలలో అనేక ప్రాంతములలో ఉన్న క్రైస్తవ సేవకులందరికీ సహాయపడతాయి!" అప్పుడు పేతురు వ్యాపారస్తులకు, వారి వ్యాపారాలను అభివృద్ధి పరచగల ఒక క్రీస్తు గురించి బోధిస్తూ, వ్యాపారస్తుల కోసం ఏర్పాటైన వివిధ కాన్ఫరెన్సుల్లో తన సాక్ష్యమిస్తూ ప్రపంచమంతా పర్యటించి ఉండేవాడు. ప్రకృతి సంబంధమైన మనస్సు యొక్క ఆలోచన ఇలా ఉంటుంది.

అయితే పేతురు అలా చేయలేదు. తన వలలు విడిచి రమ్మని యేసు అతనిని పిలిచినప్పుడు వెంటనే అతడు తన చేపల వ్యాపారమును విడిచిపెట్టి, యేసును అనుసరించాడు. అతడు పరీక్షలో గెలిచాడు.

అధిక ధనం సంపాదించుకొనేలా, దేవుడు వారి మార్గములను ఆశీర్వదించి, అభివృద్ధిపరచినప్పుడు, దేవుడు తమను పరీక్షిస్తున్నాడన్న సంగతిని చాలా కొద్దిమంది క్రైస్తవులు గుర్తిస్తారు. అనేకమంది క్రైస్తవులు పరీక్షలో ఓడిపోయేది ఇక్కడే. అపొస్తలులు

 ఎవరైనా మనకిచ్చేది తాత్కాలికమైనది. కృషితో మనం సంపాదించుకొనేది శాశ్వతం.

అవ్వాల్సిన సమయంలో వారు కేవలం కోటీశ్వరులుగా స్థిరపడతారు. సంవత్సరములు గడిచాక, ఐశ్వర్యవంతుడైన వ్యాపారి కావడానికి ఇష్టపడని పేతురు కేవలం ఇలా చెప్పగలిగాడు. "వెండి బంగారములు నా దగ్గర లేవు" (అపొ॥కా 3:6) అయితే వెండి బంగారములకు మించి శ్రేష్ఠమైనది అతని దగ్గర ఉంది. క్రీస్తు రాజ్యంలోని శాశ్వత ఐశ్వర్యం కోసం భూసంబంధమైన ఐశ్వర్యములను, విస్తారమైన సిరులను వదులుకున్నాడు.

ఒకని జీవితములో యేసు భాగస్వామిగా ఎలా భౌతికంగా అభివృద్ధి చెందాలో, ఎలా డబ్బు చేసుకోవాలో క్రైస్తవులకు బోధించే పుస్తకాలతో ఈ దినములలో క్రైస్తవ పుస్తకాల షాపులు నిండిపోయాయి! విలువైన కార్లు, ఇళ్ళు, పొలాలు – అన్నీ క్రీస్తులోని విశ్వాసం ద్వారా స్వంతం చేసుకోవడానికి క్రైస్తవులు ఈ పుస్తకాల ద్వారా ప్రేరణ పొందుతున్నారు. ఈ పుస్తకాల రచయితల భూసంబంధమైన మనస్తత్త్వమును చిన్న పిల్లవాడు కూడా గ్రహించగలడు. అయినప్పటికీ ఎందరో విశ్వాసులు మోసపోతున్నారు. వాటిలోని భౌతిక వస్తు వాహనాదులను పొందుతున్న వ్యక్తుల సాక్ష్యాలన్నీ నిజమే కావచ్చు. కానీ, వారికి ఐశ్వర్యం ఇవ్వడం ద్వారా దేవుడు వారిని పరీక్షిస్తున్నాడని వారిలో ఎంతమంది గ్రహించారు?

వారు ధనవంతులైనప్పుడు వారు తమ ఐశ్వర్యమును విడిచిపెట్టి "దేవుని యెడల ధనవంతులు కావడం" నేర్చుకుంటారో లేదో చూడడానికి దేవుడు వారిని పరీక్షిస్తాడు (లూకా 12:21) అయితే పేతురుకు భిన్నంగా చాలామంది ఆ పరీక్షలో ఓడిపోయారని చెప్పగలము.

ఆదాము సంతతివాడైన ప్రతి వానిలోనూ అహం కేంద్రంగా ఉంది. మనం మారుమనస్సు పొందినప్పుడు అహం చావదు. అది దేవుని ఎదిరించి తన స్వంత కోర్కెలు నెరవేర్చుకోవడం కోసం అడ్డదారులు వెదకుతుంది. దేవుని నుండి వచ్చే భౌతికమైన, శారీరకమైన ఆశీర్వాదాలనే నొక్కి వక్కాణించే శరీరానుసారమైన క్రైస్తవ్యానికి మూలం అహం. ఈ రోజుల్లో ఇది పుస్తకాలలో "విశ్వాసం" అనే ముసుగు ధరించి మన దగ్గరికి వస్తోంది. అయితే ఈ పుస్తకాల వలన ఒక ప్రయోజనం కూడా ఉంది. వాటి పాఠకుల హృదయాలు నిజంగా దేనిని ఆశిస్తున్నాయో – భూసంబంధమైన వాటినా లేక పరలోకసంబంధమైన వాటినా అనే దానిని అవి వెల్లడి చేస్తాయి. ఆ విధంగా క్రైస్తవ్యంలోని ధాన్యం నుండి చెత్త వేరుచేయబడుతుంది!

**"మీలో యోగ్యులైనవారెవరో కనబడునట్లు మీలో భిన్నాభిప్రాయములుండక తప్పదు" (1 కొరింథీ 11:19)**

**– సేకరించబడింది**

# ప్రార్థనా శక్తి

**కాబట్టి సహోదరులారా, పరిశుద్ధమును దేవునికి అనుకూలమునైన సజీవ యాగముగా మీ శరీరములను ఆయనకు సమర్పించుకొనుడని దేవుని వాత్సల్యమును బట్టి మిమ్మును బతిమాలుకొనుచున్నాను. ఇట్టి సేవ మీకు యుక్తమైనది - రోమా 12:1లో** వ్రాసిన విధంగా విధేయత చూపుటకు, మన సామర్థ్యములను దేవునికి అప్పగించుకొనుటకు మనము నిర్ణయించుకోవాలి. మన మనసులను సాతానుని ఉపయోగించుకోనివ్వకూడదు. మన మనసు వాడికి ఇష్టమైన యుద్ధరంగం, వాడు దినమంతా ఆలోచనా బాణములను సంధిస్తూనే ఉంటాడు. చాలా సమయములలో అవి కుయుక్తి, కపటమైన మరియు మోసకరమైన ఆలోచనలై ఉంటాయి. కాబట్టి అవి మనం చాలా తేలికగా నమ్ముతాము. మన సంతోషమును, సమాధానమును దొంగిలించుటకు మనం చెడిపోయామని, అర్హత లేని వారమని తలంచుటకు ఏమి చెయ్యాలో అన్నీ చేసి, చెప్పవలసిన అబద్ధాలు, నిందలు వాడు చెప్తాడు. ఇతరుల గురించి పాపకరమైన ఆలోచనలతో వాడు మన మనసులను నింపుతాడు. మన దారిలోకి ఆలోచనలను పంపకుండా మనం వాడిని ఆపలేము, కాని మనం వాటిని నిరోధించి, గద్దించి వాటిపై యుద్ధం చేయగలం. దేవుని బిడ్డలను ఆటంకపరచడం అనేది వాడికి జీవమార్గము వలె ఉన్నది కాబట్టి, మనం కూడా ప్రార్థనను జీవమార్గముగా ఎంచుకొనవలసి ఉన్నది.

ఇతరుల గురించి వాడు మనకు చెడు ఆలోచనలను ఇచ్చినప్పుడు వాడిని ఎదిరించుటకు ఉత్తమ మార్గములలో ఒకటి, ఆ వ్యక్తి గురించి వెంటనే ప్రార్థించుట. మన ఆలోచనలను మనం సరియైన వాటితో నింపుకున్నప్పుడు తప్పుడు వాటికి చోటే ఉండదు. సాతాను యొక్క అబద్ధములను ఆపుటకు మనం ఏమి చేయాలి ? యేసు ఏమి చేశాడో అదే మన నోరు తెరిచి మనం చేయాలి, బైబిల్ వాక్యమును ఎత్తి చూపించాలి. ఉదాహరణకు ఒక వ్యక్తి గురించి వాడు అబద్ధములు చెప్తున్నట్లయితే, "ప్రేమ అన్నింటిని నమ్మును, అన్నింటిని తాళుకొనును అని బైబిల్ చెప్తున్నది. నేను ప్రేమలో నడుస్తున్నాను మరియు ప్రేమ ప్రతి మనిషిలోని ఉత్తమమైన దానిని ఎల్లప్పుడూ నమ్ముతుంది. ఆ వ్యక్తి ఫలానా ఫలానా విధంగా ఉన్నాడని నా దగ్గర ఏ ఋజువు లేదు, కాబట్టి నేను దానిని నమ్మడం లేదు సాతానా" అని చెప్పుట ద్వారా ఆ అబద్ధాలను ఖండించవచ్చు. దేవుని వాక్యము సాతానుని ఎదిరించుటకు శక్తినిస్తుంది. ఉదాహరణకు మన భవిష్యత్ బావుండదని సాతాను చెప్పడానికి ప్రయత్నించినప్పుడెల్లా, యిర్మియా 29:11లోని వాక్యమును ఎత్తి నా కొరకు, నా భవిష్యత్ కొరకు సమాధానకరమైన ఉద్దేశ్యములనే దేవుడు కలిగి ఉన్నాడని చెప్పాలి. మనం వాక్యమును బాగా తెలిసికొని ఉండాలి అనుటకు ఒక కారణం ఏమిటంటే దాని ద్వారా మనం

topwalls.net

సాతానుని ఓడించగలం. వాడిని కొట్టే ఆయుధం ఇదే, దానిని మనం ఉపయోగించుకోవాలి.

మనకి ఇవ్వబడిన పని, మనం చేస్తున్న పని, అది ఏ పని అయినను మన ప్రభువుకు సమర్పించుకొనినప్పుడు ఆయనకు మన సామర్థ్యమును, మన తలాంతులను అప్పగించుకొంటున్నాము అని అర్థం. చాలామంది తమ సామర్థ్యములను తమ పనిలో ఉపయోగిస్తారు అంటే తమ వృత్తి జీవితములలో, తమ ఉద్యోగములో నీతిని, సమయమును సద్వినియోగపరచుకొనుటను, తమ కంపెనీ వస్తువుల విషయములో తమ గృహనిర్వాహకత్వమును, తమ తోటి పనివారితో తమ ప్రవర్తనను దేవునికి మహిమ తెచ్చే విధంగా చూచుకుంటారు. మనం యజమానుని కొరకు పని చేస్తున్నవారిగా కాక దేవుని కొరకు పనిచేస్తున్న వారిగా చూచుకోవాలి. మనం ప్రతి దినం పనికి వెళ్ళి ప్రతీది సరిగా శ్రేష్ఠంగా చేయాలన్న నిర్ణయమును కలిగి ఉండాలి. ఎవరూ చూడడం లేదని మనం చేయకూడని పనులు చేయకూడదు. ఎవరికీ కనబడకుండా పనిని ఎలా వదిలేయవచ్చు లేదా త్వరగా ఎలా ఇంటికి వెళ్ళవచ్చు అని ప్రయత్నించకూడదు. దేవునికి సమర్పించుకున్న జీవితములు కలవారు ఆయన తమను ఎల్లప్పుడూ చూచుచుంటారని తెలిసికొనియుంటారు, ఆయనను సంతోషపరచాలని వారు ఎరిగియుంటారు. వారు తమ జీవితములను దేవుని ఎదుట **కొలస్సీ 3:23లో "ప్రభువు వలన స్వాస్థ్యమును ప్రతిఫలముగా పొందుదుమని యెరుగుదురు గనుక, మీరేమి చేసినను అది మనుష్యుల నిమిత్తము కాక ప్రభువు నిమిత్తమని మనస్ఫూర్తిగా చేయుడి, మీరు ప్రభువైన క్రీస్తునకు దాసులైయున్నారు"** అని చెప్పబడినట్లుగా వెలుగులో నడువవలసి యున్నది.

దేవుని వాక్యము సాతానును ఎదిరించే శక్తినిస్తుంది.

ఇంకా ఉంది

సేకరించబడినది (జాయిస్ మేయర్)

topwalls.net




# బైబిల్ క్విజ్ -36

(నిర్గమకాండము)

ఈ క్రింది ప్రశ్నలకు సరైన జవాబులు వ్రాయండి

**1.** ఏ రత్నంలో పన్నెండు ఇశ్రాయేలీయుల పేర్లు వ్రాయబడ్డాయి?

**2.** దేవుని చేవ్రాతతో వ్రాయబడి మోషే హస్తాలకు ఇవ్వబడింది ఏమిటి?

**3.** దీప వృక్షాన్ని చేయడానికి వాడిన పదార్థం ఏమిటి?

**4.** జ్ఞాన విద్యావివేకములతో, దేవుని ఆత్మతో నింపబడినవాడు ఎవడు?

**5.** మందసాన్ని తయారుచేయడానికి వాడిన కర్ర ఏమిటి?

**6.** తన ముఖచర్మం ప్రకాశిస్తుందనే సంగతి తెలియనిది ఎవరికి?

**7.** హోరేబులో మోషే చేసిన బలిపీఠానికి అతడిచ్చిన పేరేమిటి?

**8.** ప్రజలందరి సమక్షములో యెహోవా ఏ పర్వతం మీద దిగాడ?

**9.** విశ్రాంతి దినమును అపవిత్రపరచువాడు ఏమి చేయబడును?

**10.** ఇశ్రాయేలీయులు పొంగని వాటి పండుగ ఏ నెలలో ఆచరించాలి?

ఈ ప్రశ్నలకు సరైన సమాధానములు అక్టోబర్ 15వ తేదీ లోపు మాకు వ్రాసి పంపించండి. సరైన సమాధానములు వ్రాసిన వారి పేర్లు నవంబర్ 2014 పత్రికలో ప్రచురించబడతాయి.

**పంపవలసిన చిరునామా:- ఎడిటర్ - స్పర్శ,** ఎపఫ్రా మినిస్ట్రీస్, ప్లాట్ నెం.1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా, భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070.

**బైబిల్ క్విజ్-35 జవాబులు (ఆదికాండము/నిర్గమకాండము నుండి ఇవ్వబడినవి :**

1.శోధన, వాదము (ని॥17:7),
2.ఎలీషెబ (ని॥6:23),
3.ఏలీము (ని॥15:27),
4.దాను (ఆది॥ 49:17),
5. సీను అరణ్యం (ని॥16:1-4),
6.మూడు నెలలు (ని॥2:2),
7.యోసేపు (ఆ॥కా 50:25),
8.షిఫ్రా, పూయా (ని॥1:15,16)
9. జెబూలూను (ఆ॥కా॥ 49:13)
10. యెహోవా (ని॥14:25)

**బైబిల్‌క్విజ్-35 ప్రశ్నలకు జవాబులు వ్రాసి పంపినవారి పేర్లు:**

ఆర్.సుశీల,నీతా, స్తెఫను, ఎస్.విఠల్‌రావు, ఎస్.ఎస్తేరు, జగదీప్ కుమార్, పి.పార్వతి, సి.హెచ్.పాల్‌రాజ్, వి.సుధారాణి, పి.చంద్రకళ, లత, పాపరమేష్, వై.వాసవ్య, ఐజాక్‌కుమారి, ఎమ్.తులసి, ఎమ్.రాజుఫ్లోరెన్స్

topwalls.net

# జన్మదిన శుభాకాంక్షలు

క్రీస్తునందు ప్రియులైన వారికి శుభమని చెప్పి వ్రాయునది.
తండ్రియైన దేవుని నుండి కృపయు, సమాధానము మీకు కలుగును గాక !
ఈ పత్రిక ద్వారా జన్మదిన శుభాకాంక్షలు తెలియజేస్తున్నాము.

**" నీ దేవుడైన యెహోవా కన్నులు సంవత్సరాది మొదలుకొని సంవత్సరాంతము వరకు ఎల్లప్పుడు మీ జీవితముల మీద ఉండును గాక ! "**

## సెప్టెంబర్ - అక్టోబర్

**భాగ్యలత:** వాసుదేవరావు, సందీప్, శ్రేయస్, కవిత, సుజాత, టైటస్, ఇందిరాప్రియ, జ్యోతి, ప్రియాంక, ఐజాక్, కృష్ణబాలాజి, జయశ్రీ, ప్రసాద్, పుష్పలత, శ్రీలక్ష్మి, సుధావల్లి, ఓలీవషారోన్, కిరణ్‌కుమార్, షాలేమ్, ప్రసన్నకుమార్, బ్యూలా, మాధురి, చంద్రవర్మ, హెప్సిబా, ప్రేమకుమార్, జోసెఫ్‌స్పర్జన్, యోసేపు, గ్లాడీ, దీవెన, చెన్నకేశవరెడ్డి, సుకుమార్, ఎపఫ్రా, సాయికుమార్, నవ్య, దివ్యదీపిక, స్వరూప్, అరుణ, రిక్విన్‌రాజ్, పద్మశ్రీ, సలోమి, హోసన్న, రాణి, శేఖర్, ప్రజ్ఞ, రిత్వికేష్, ఉదయశ్రీ, విజయ్‌కుమార్, విజయకుమారి, అనిత, రామలక్ష్మి, అన్నపూర్ణ, నిర్మల్, రామకృష్ణ, సుష్మ, సైమన్, సృజన్, లక్ష్మి, కీర్తి, శిరీష, వెంకట్రాములు, వినీత, ప్రత్యూష, నిర్మల, గౌతమి, షైనీజ్యోతి, ఉషారాణి, విజయ, సాల్మన్‌రాజ్, ఫిలిప్, మాధవి, ప్రసన్నరాణి, నవీన్‌కుమార్, అభిజ్ఞ, మాధవి, స్రవంతి, హర్షిత, సుహాసిని, శ్యామ్, పూర్ణజ్యోతి, సాహిత్, మాధవి, శామ్సన్, యేసుబాబు, ప్రగతి, మేరీ ఆదిలక్ష్మి,జ్యోత్స్న, దీపిక, మనీషభాను, విజయ్‌రాజ్, సత్యనారాయణ, షారోన్, త్రివేణి, ప్రియదర్శిని, చంద్రకళ, విజయలక్ష్మి, సుజాత, శ్రీధర్, నిస్వార్థ్, సాయికస్తూరి, ప్రదీప్‌కుమార్.

**చింతల్:** కృష్ణవేణి, సుధాకర్, సోన్‌రాజ్, ప్రసాద్, శ్యామ్‌శేఖర్, కళ్యాణ్, ఎఫ్రాయిమ్, రాజేష్, రాజు, పద్మజారాణి, పవన్‌కుమార్, సునీల్‌కుమార్

**అనాజ్‌పూర్:** వరప్రసాద్, జాన్సన్, కళ్యాణ్‌కుమార్, రామారావు, సుష్మ, మమత.

**ఇ.సి.ఐ.ఎల్:** సుజని

**"స్పర్శ"** అనే మన ద్విమాస పత్రిక సంవత్సర చందా రూ. 100/- లు, జీవితకాల చందా రూ. 2000/- లు మరియు విదేశములకు సంవత్సరమునకు **US $ 40.**

చందాదారులు కావలసిన వారు **ఎపఫ్రా మినిస్ట్రీస్ ట్రస్ట్, హైదరాబాద్** (Epaphras Ministries Trust, Hyderabad) పేరున **డి.డి/మనిఆర్డర్** తో పాటు మీ పూర్తి వివరములు ఈ ఫారములో నింపి మా చిరునామాకు పంపించగలరు.

1. పూర్తి పేరు: ______________________________

2. చిరునామా: ______________________________

______________________________

______________________________

పిన్ కోడ్: ______________________________

**మీ ప్రార్థనావసరతలు:**

______________________________

______________________________

______________________________

______________________________

మా చిరునామా:
**ఎపఫ్రా మినిస్ట్రీస్,** ప్లాట్ నెం. 1, శాంతి నగర్, వాటర్‌ట్యాంక్ ఎదురుగా,
భాగ్యలత కాలని, వనస్థలిపురం, హైదరాబాద్-70, ఫోన్: 040-2420 2227



2014, ఆగష్టు 15వ తేది జరిగిన ఉపవాస ప్రార్థనలో అనేకులు
పాల్గొని దేశం కొరకు ప్రార్థించడం జరిగినది.

2014, ఆగష్టు 15వ తేది జరిగిన ఉపవాస ప్రార్థనలో జరిగిన
జెండా వందన కార్యక్రమములో పాల్గొనిన విశ్వాసులు.












# ఎపఫ్రా మినిస్ట్రీస్

ప్లాట్ నెం.1, శాంతినగర్, భాగ్యలత కాలని,
వనస్థలిపురం, హైదరాబాద్ - 500 070

Ph: 040-24202227 Cell: 9666666249
email: mail2church@gmail.com | web: www.epaphra.org



*Published by:* T.Epaphras, Plot No.1, Shanti Nagar, Opp.Water Tank, Bhagyalatha Colony, Vanasthalipuram-500070, Hyderabad.
*Printed by:* Vamsi Art Printers, Lakdikapool, Hyderabad (AP) | *Editor:* Bro. T.Epaphras